సాక్షి నల్లగొండ

సోమవారం । 24 । జూన్ । 2024



డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు

డిండి ప్రాజెక్టు ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటరీలకు ఆదివారం ఇరిగేషన్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

- 8లో



సాగర్‌లో బౌద్ధ విహార బృందం

నాగార్జునసాగర్‌ను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరికి చెందిన బౌద్ధ విహార బృందం సందర్శించింది.

- 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

7.8 మి.మీ. వర్షపాతం

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సగటున 7.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మండలాల వారీగా అత్యధికంగా మునుగోడులో 51.5 మిల్లీమీటర్లు, నల్లగొండలో 40.5, తిప్పర్తిలో 30.7, అత్యల్పంగా కనగల్ మండలంలో 0.5 మి.మీ. వర్షం కురిసింది. అలాగే శాలిగౌరారంలో 24.8, కట్టంగూర్‌లో 22.2, మాడుగులపల్లి 19.5, వేములపల్లి 10.9, నకిరేకల్ 10.0, చింతపల్లి 8.8, మిర్యాలగూడ 8.3, నార్కట్‌పల్లి 5.2, కేతేపల్లి 5.1, మర్రిగూడ 5.0, చందూరు 2.7, గట్టుప్పల్ 2.0, చిట్యాల 1.7, నాంపల్లి 1.2, త్రిపురారం మండలంలో 0.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యం

మునుగోడు: దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీరు అందించే పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులిచ్చి పనులు పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం మాటల గారడీతో కాలయాపన చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్జ రామచంద్రం, బొల్గూరి నర్సింహ, తిరిపారి వెంకటేశ్వర్లు, నలపరాజు రామలింగయ్య, చాపల శ్రీను, బూడిద సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహ



నరసింహకు శుభాకాంక్షలు తెలుపుతున్న సంఘం నాయకులు

నల్లగొండ రూరల్: తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోనేటి నరసింహ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆదివారం నల్లగొండలో సంఘం నాయకులు పూల బొకేలు అందించి, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకినిరాజు, రవికుమార్, వనం రమేష్, రుద్రాక్ష నరసింహ, రాయపురం వెంకటేశ్వర్లు, కోనేటి రాజు, పల్లంకొండ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ సమైక్య వేదిక లోగో ఆవిష్కరణ

యాదగిరిగుట్ట: శ్రీలక్ష్మీ హయగ్రీవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధార్మిక చాత్తాద శ్రీవైష్ణవ సమైక్య వేదిక లోగోను యాదాద్రి దేవస్థానం ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహాచార్యులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన సంస్కృతి పరిరక్షణ ధర్మ ప్రచారం కోసం సత్ సంకల్పంతో ఏర్పాటైన శ్రీవైష్ణవ సమైక్య వేదిక.. సమాజాన్ని ఆధ్యాత్మిక వైపు నడిపిస్తుందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, సకల జనులకు ఆధ్యాత్మిక చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షులు తోమాల కొండస్వామి యాదాద్రి ప్రధానార్చకులను సత్కరించారు.

పాలిసెట్ కౌన్సిలింగ్ ప్రారంభం



సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ జానకీదేవి

రామగిరి(నల్లగొండ): పాలిసెట్–2024 కౌన్సిలింగ్ నల్లగొండలోని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కౌన్సిలింగ్ ఇన్‌చార్జి, కళాశాల ప్రిన్సిపాల్ పి.జానకీదేవి మాట్లాడుతూ.. తొలిరోజు కౌన్సిలింగ్‌కు మొత్తం 320 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఈ నెల 24 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 25 వరకు కౌన్సిలింగ్ కొనసాగుతుందన్నారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న వారు కళాశాలల ఎంపికకు 27వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని సూచించారు.

పాలనలో సరికొత్త మార్పు

నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

- ప్రతి సోమవారం నిర్వహణకు ప్రణాళిక
- పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కరించేలా చర్యలు
- 15 రోజుల్లో అర్జీల పురోగతి చెప్పాల్సిందే..
- నేటి జిల్లా స్థాయి ప్రజావాణి రద్దు



సాక్షిప్రతినిధి, నల్లగొండ: జిల్లా పరిపాలనలో సరికొత్త మార్పునకు కలెక్టర్ నారాయణరెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ఇకపై ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణిని నిర్వహించబోతున్నారు. మండలాల్లో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీనిని నిర్వహించేలా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అలాగే మున్సిపాలిటీల్లోనూ ప్రజావాణిని నిర్వహిస్తారు. తద్వారా సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ప్రతి సమస్యకు 15 రోజుల సమయం ఇచ్చి పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఆలోగా పరిష్కరించకపోతే ఎందుకు పరిష్కరించలేకపోయారనే వివరాలను ఫిర్యాదుదారులకు స్పష్టంగా రాతపూర్వకంగా అందజేయడం ద్వారా జవాబుదారీతనాన్ని పెంచాలని నిర్ణయించారు. ఒకవేళ మండల స్థాయిలో పరిష్కారం కాకుంటే ఆ తరువాత జిల్లా స్థాయిలోనూ విజ్ఞప్తి చేసుకునే అవకాశం కల్పిస్తారు.

ఏ సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా..

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొనే ఏ సమస్యనైనా ప్రజలు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. ఇన్నాళ్లు మండలాల్లో పరిష్కారం కాని ఏ సమస్య అయినా జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే ప్రజావాణిలో ఫిర్యాదు చేసేవారు. ఇప్పుడు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపేలా ఈవిధానం అమలుకు శ్రీకారం చుట్టారు.

అంతటా ఏర్పాట్లు పూర్తి

మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహించేందుకు కలెక్టర్‌ఆదేశాల మేరకు యంత్రాంగం మండలాల్లో అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రజావాణి నిర్వహించే కార్యాలయాలను ఎంపిక చేసింది. ప్రజావాణి నిర్వహించే హాళ్లలో కంప్యూటర్లు, ప్రింటర్లు, సిబ్బంది, తాగునీరు, ప్రజలు వేచి ఉండేందుకు వసతి వంటి అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. ప్రతి ఫిర్యాదుకు రసీదు ఇస్తారు. ప్రతి ఫిర్యాదుకు ఒక ప్రజావాణి ఐడీ నంబర్ కూడా ఉంటుంది.

ఎవరెవరు ఉంటారంటే..

మండల ప్రజావాణి ఎంపీడీఓ అధ్యక్షతన జరుగుతుంది. మండలంలో ఆయనే ప్రజావాణి ప్రత్యేక అధికారి. ఇందులో తహసీల్దార్, మండల విద్యాధికారి, వ్యవసాయ అధికారి, ఏపీఎంతోపాటు సంక్షేమ, అభివృద్ధి శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొంటారు. అలాగే ఒక జిల్లా స్థాయి అధికారి ప్రతి మండలంలో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని స్వయంగా పర్యవేక్షిస్తారు.

నేడు జిల్లా కేంద్రానికి రావద్దు

ఈనెల 24న (సోమవారం) జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణిని రద్దు చేశాం. ప్రజలెవరూ జిల్లా కేంద్రానికి రావద్దు. వచ్చేవారం ఉంటుందా? లేదా? అనేది తరువాత తెలియజేస్తాం. 33 మండల కేంద్రాలతోపాటు నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ మున్సిపాలిటీల్లోనూ ప్రజావాణి ఉంటుంది.

– నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్, నల్లగొండ

పరిశీలించనున్న కలెక్టర్

సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చండూరు మున్సిపాలిటీతోపాటు, మర్రిగూడ, నాంపల్లి మండలాల ప్రజావాణిని పరిశీలించే అవకాశం ఉంది.

జిల్లా స్థాయికి ఎప్పుడు రావాలంటే..

మండల స్థాయిలో సమర్పించిన ఫిర్యాదుకు 15 రోజులైనా పరిష్కారం లభించకపోతే జిల్లా స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా స్థాయి ప్రజావాణిలో అత్యవసర సమస్యలు, వృద్ధులు, దివ్యాంగుల సమస్యలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరిస్తారు. మండల స్థాయిలో పరిష్కారం కాని వాటికి రెండో ప్రాధాన్యం ఇస్తారు. నేరుగా జిల్లా స్థాయి ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు చివరి ప్రాధాన్యం ఉంటుంది.

ఏయే పత్రాలు తీసుకెళ్లాలంటే..

ఫిర్యాదుదారులు వారు తమ సమస్యకు సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.500 ఎల్పీజీ సిలిండర్ రాయితీ పొందేవారు వారి ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఇదివరకు ఉన్న ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ నంబర్ వంటి ఆధారాలతో వెళ్లాలి. గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్ పొందాలనుకునేవారు వారు ఇదివరకు చెల్లించిన కరెంట్ బిల్లు, మీటర్ నంబర్, ఆధార్ కార్డు, ఇతర ఆధారాలతో వెళ్లాలి. భూములకు సంబంధించిన సమస్యలపై అన్ని ధురవీకరణ పత్రాలు తీసుకెళ్లాలి.

పదవులు కాదు.. ప్రజలే ముఖ్యం



చిట్యాలలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- చిట్యాలలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చిట్యాల: తనకు పదవులు లెక్క కాదని.. ప్రజలే ముఖ్యమని.. ప్రజల సమస్యల పరిష్కారానికే నిరంతరం పనిచేస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. చిట్యాలలో 65 నంబర్ జాతీయ రహదారిపై రూ.40 కోట్ల నిధులతో నిర్మించనున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి ఆదివారంరాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంతో కలిసి భూమి పూజ, శంకుస్థాపన కార్యక్రమాలను చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 65వ నంబర్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ నుంచి కోదాడ వరకు అత్యధికంగా ప్రమాదాలు జరుగుతున్న 17 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు రూ.350 కోట్ల నిధులతో అవసరమైన ఫ్లైఓవర్లు, విస్తరణ పనులను చేపట్టుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో చిట్యాల, పెద్దకాపర్తి, కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట హైవేపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టుకు రూ.400 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో పెండింగ్ పనులు పూర్తిచేసి అరవై వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. జిల్లాలో అసంపూర్తి సాగునీటి కాల్వలను పూర్తి చేసేందుకు రూ.2,200 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

నకిరేకల్ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం

నకిరేకల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు మొదటి ప్రాధాన్యతనిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ ప్రారంభ దశలో చిట్యాల, నార్కట్‌పల్లికి చెందిన పలువురు నాయకులు తనకు అండగా నిలిచారని, వారి పేర్లను ప్రస్తావించారు. చిట్యాలలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేస్తానని, ప్రభుత్వ ఆస్పత్రిని యాభై పడకల ఆస్పత్రిగా మార్చుస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు కాటం వెంకటేశం, పందిరి శ్రీనువాసులు, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ల శిశుపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్లు ఏనుగు రఘుమారెడ్డి, సుంకరి మల్లేష్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి, బొంతల అంజిరెడ్డి, దుబ్బ కుమార్, జనగాం రవీందర్‌గౌడ్, గోలి గణేష్, నీలకంఠం లింగస్వామి, పల్లపు బుద్ధుడు, కోనేటి యాదగిరి పాల్గొన్నారు.



చిట్యాలలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే వీరేశం

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ ధ్యేయం

- సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మాడుగులపల్లి: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా సీఐటీయూ పనిచేస్తోందని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మాడుగులపల్లి మండలం గజలాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విశాఖ పరిశ్రమ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ గెలిపించాలని కోరారు. పరిశ్రమలో కొంతమంది కాంట్రాక్టర్లు స్వలాభం కోసం కార్మికుల మధ్య చిచ్చుపెట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన సీఐటీయూతోనే సాధ్యమని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డబ్బికార్ మల్లేష్, కార్మిక యూనియన్ నాయకులు బంగారు ఎల్లయ్య, జాని, సోమయ్య, శ్రీను, శ్రీధర్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు ఆదివారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం జరిపించారు. అనంతరం ఎదుర్కోలు మహోత్సవం, విశ్వక్సేనారాధన రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణతో కల్యాణతంతు పూర్తిచేశారు.

నారసింహుడికి నిత్యారాధనలు



యాదాద్రి ప్రధానాలయ మాడ వీధుల్లో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాతం సేవ, ఆరాధన నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నిజాభిషేకం చేసి తులసీదళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవను మాడ వీధిలో ఊరేగించారు. వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పదోన్నతులు.. కొత్త చిక్కులు

- కొనసాగుతున్న ఎస్జీటీల ప్రమోషన్ల ప్రక్రియ
- ఐదుగురు టీచర్లకు మూడేసి పదోన్నతులు
- ఒక పోస్టులో చేరితే మిగతావి ఖాళీగానే..
- ఖాళీలు ఉంచకుండా అర్హులతో భర్తీచేయాలంటున్న ఉపాధ్యాయులు



నల్లగొండ: జిల్లాలో ఉపాధ్యాయ పదోన్నతుల ప్రక్రియలో ఆన్‌లైన్ వెబ్ ఆప్షన్ విధానం వల్ల కొత్త చిక్కులు వచ్చి పడుతున్నాయి. ప్రస్తుతం ఎస్జీటీల పదోన్నతులు కొనసాగుతుండగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్ వెబ్‌లో ఆప్షన్లు ఇచ్చుకున్నారు. కొందరు ఉపాధ్యాయులకు మూడు పదోన్నతులు వచ్చాయి. మూడు పదోన్నతులు వచ్చిన ఉపాధ్యాయులు ఒక పోస్టులో చేరితే.. రెండు పోస్టులు మిగిలి ఉండే పరిస్థితులు దాపురించాయి. అయితే పదోన్నతుల విషయంలో ఇబ్బందులు చోటు చేసుకుంటుండడంతో విద్యా శాఖ అధికారులకు తలనొప్పిగా మారింది.

కొన్ని పోస్టులు మళ్లీ ఖాళీగానే..

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా విద్యా శాఖ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఎస్జీటీలకు సీనియారిటీ ప్రకారం ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్లుగా ఆయా సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందేందుకు అవకాశం కల్పించింది. అందు కోసం ఆన్‌లైన్ వెబ్‌లో పదోన్నతులు పొందేందుకు వెబ్ ఆప్షన్లకు అవకాశం ఇచ్చింది. దీంతో కొందరు ఉపాధ్యాయులు పీఎస్ హెడ్మాస్టర్లుగా ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లుగా, సోషల్, ఇతర సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కోసం ఆన్‌లైన్ వెబ్‌లో ఆప్షన్లు ఇచ్చారు. దీంతో కొందరు ఉపాధ్యాయులకు సీనియారిటీని బట్టి మూడేసి పదోన్నతులు దక్కాయి. ఒక ఉపాధ్యాయురాలికి, మరో నలుగురు ఉపాధ్యాయులకు హెచ్‌ఎం పదోన్నతితో పాటు మరో 2 సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. వీరు ఏదో ఒక పదోన్నతి తీసుకుంటారు. మిగిలిన రెండు ఖాళీల్లో అర్హత ఉన్న సీనియర్ టీచర్లకు పదోన్నతి పొందే అవకాశం లేని పరిస్థితి. దీంతో అర్హత ఉన్న ఉపాధ్యాయుడు నష్టపోవడంతోపాటు ఆ రెండు పోస్టులు అలాగే ఉంచుతారు. ఫలితంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మళ్లీ ఖాళీగానే ఉంటాయి. దీంతో ఒకపక్క అర్హత ఉన్న టీచర్లకు పదోన్నతులు రాక.. మరోపక్క పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరతతో విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉంది.

ప్రభుత్వం స్పందిస్తేనే అర్హులకు న్యాయం

మూడు చొప్పున పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల విషయంలో ప్రభుత్వం స్పందించాల్సి ఉంది. ఏ టీచర్ అయితే మూడు పదోన్నతులు పొందుతారో వారికి తాము కోరుకున్న ఒక పోస్టులో పదోన్నతి కల్పించి మిగిలిన పోస్టుల్లో ఆ తర్వాత సీనియారిటీ ఉన్న ఉపాధ్యాయులతో భర్తీ చేస్తే అర్హులకు న్యాయం జరగడంతోపాటు పోస్టుల ఖాళీలు ఉండవు. దీంతో విద్యార్థులకు కూడా సబ్జెక్టు టీచర్లు లేని కొరత తీరనుంది. ఈ విషయంలో విద్యా శాఖ ఉన్నతాదికారులు వెంటనే నిర్ణయం తీసుకుని ఆ తర్వాత అర్హత ఉన్న ఉపాధ్యాయులకు వెబ్ ఆప్షన్‌ల్లో ఖాళీగా ఏర్పడ్డ వాటిని సీనియారిటీ ప్రతిపాదికన భర్తీ చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

‘ఆరుద్ర’లోనూ అంతంతే..!

ఊపందుకోని వానాకాలం సాగు పనులు

- జూన్ మొదటి వారంలో మినహా మళ్లీ కురవని సరైన వర్షాలు
- ఈ ఏడాది సాగు విస్తీర్ణం అంచనా 11.40లక్షల ఎకరాలు
- ఇప్పటి వరకు 2.4లక్షల ఎకరాల్లోనే సాగు
- వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులు



నల్లగొండ సమీపంలో పత్తి మొలకలు మొలవని చోట మళ్లీ గింజలు పెడుతున్న రైతు

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం సాగు పనులు మందకొడిగా సాగుతున్నాయి. సీజన్ ఆరంభమై మృగశిర కార్తెలో పోయి ఆరుద్ర కార్తె వచ్చినప్పటికీ సాగు పనులు ఊపందుకోలేదు. సరైన వర్షాలు కురవకపోవడంతో జిల్లా వ్యాప్తంగా సాగు పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి.

సాగు అంచనా ఇలా..

ప్రస్తుత వానాకాలంలో మొత్తం 11.40లక్షల ఎకరాల్లో పత్తి, వరి, వేరుశనగ, కంది, పెసర, ఇతర పంటలను రైతులు సాగు చేయనున్నట్టు జిల్లా వ్యవసాయశాఖ అంచనా వేసింది. కానీ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2లక్షల 40 వేల ఎకరాల్లో మాత్రమే పత్తి, వరి సాగు చేసుకున్నారు. అత్యధికంగా పత్తిని 2లక్షల 39 వేల ఎకరాల్లో సాగు చేయగా వరి మాత్రం 500 ఎకరాల్లోనే నాట్లుపెట్టుకున్నారు. ఇంకా లక్ష ఎకరాలకు సరిపోను వరినార్లను రైతులు సిద్ధం చేసుకున్నారు.

ముందు మురిపించిన వరుణుడు

జిల్లాలో జూన్ మొదటి వారంలోనే రికార్డు స్థాయిలో నెలాఖరు వరకు కురవాల్సిన వర్షం కన్నా అత్యధికంగా కురిసింది. జూన్ నెఖారు వరకు 67 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 146.2 మిల్లీమీటర్లు కురిసింది. జూన్ రెండో వారం నుంచి కేవలం అడపాదడపా మాత్రమే వర్షాలు కురిశాయి. జిల్లాలో మొదట కురిసిన వర్షానికి అప్పటికే దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్న రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. మిగతా ప్రాంతాల్లో పత్తి గింజలు నాటుకునేందుకు దుక్కులు సిద్ధం చేసుకోవడంతో పాటు వరినార్లు పోసుకోవడానికి మడులు దున్నుకుని రెడీగా ఉన్నారు.

వర్షం కోసం నిరీక్షణ

నాన్ ఆయకట్టు ప్రాంతమైన నల్లగొండ, దేవరకొండ, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని మండలాల్లో బోర్ల కింద నార్లు పోసుకుని వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. శుక్ర, శని ఆదివారాల్లో కురిసిన వర్షాలకు ఎండిపోయిన పత్తి మొలకల స్థానంలో పత్తి గింజలను పెట్టుకుంటున్నారు. రెండు రోజులుగా కేవలం నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, మిర్యాలగూడ నియోజకవర్గాల్లోనే వర్షం కురిసింది. ఆరుద్ర కార్తె ఆరంభమైనప్పటికి మబ్బులు మినహా పెద్దగా జిల్లా అంతటా వర్షాలు కురవకపోవడంతో సాగు పనులు మందగించాయి. వరుణుడు కరుణించి జిల్లా అంతటా వర్షాలు కురిస్తే తప్ప జిల్లాలో వానాకాలం సాగు ఊపందుకోని పరిస్థితి నెలకొంది.

వర్షం కురిస్తే వరినాటు పెడతా..



వరినార్లు పోసుకుని ఇరవై రోజులవుతుంది. వర్షం వస్తే వెంటనే మడులు దున్నుకుని వరినాట్లు వేసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. ఆరుద్ర కార్తె వచ్చినప్పటికీ సరైన వానలు కురవడంలేదు. మంచి వర్షాలు కురిస్తే ఉన్న పొలమంతా నాటు పెట్టుకుంటా.

– జానపాటి రాజేంద్రప్రసాద్, రైతు, గుండ్లపల్లి, నల్లగొండ మండలం

సరైన వాన వస్తేనే పత్తి విత్తనాలు పెట్టుకోవాలి



సరైన వాన కురిస్తేనే రైతులు పత్తి విత్తనాలు పెట్టుకోవాలి. తొందరపడి పదును లేని భూముల్లో విత్తనాలు పెట్టుకోవద్దు. వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

– పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

క్లుప్తంగా

ట్యాంకర్ ఢీకొని ఒకరి దుర్మరణం

బీబీనగర్: మండల కేంద్రంలోని పోచంపల్లి రోడ్డు మార్గంలో ఆదివారం లారీ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలంలోని లక్ష్మిదేవిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన జిల్కపల్లి ప్రవీణ్(27) బీబీనగర్‌లోని మాంటిస్సోరీ ప్రైవేట్ పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు ఉండడంతో పని నిమిత్తం బైక్‌పై బీబీనగర్ మండల కేంద్రానికి వచ్చి తిరిగి సాయంత్రం ఇంటికి వెళ్తుండగా పోచంపల్లి రోడ్డు మార్గంలోని పెట్రోల్ బంక్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ట్యాంకర్(ఏపీ 39 టీఈ 2289) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రవీణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. లారీని అదుపులోకి తీసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

వలిగొండ: చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని ఎదుళ్లగూడెంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎదుళ్లగూడేనికి చెందిన కొలను మోహన్‌రెడ్డి (42) టేకుల సోమారం గ్రామ పరిధిలోని తాడిసి సురేందర్ రెడ్డికి చెందిన బత్తాయి తోటలో అల్లనేరేడు చెట్టు ఎక్కి పండ్లు తెంపుతుండగా.. చెట్టు కొమ్మ విరగడంతో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులో గల పాత ఊరిలో ఆదివాంర ఓ బాలుడు ఆడుకుంటూ వెళ్లి విద్యుత్ స్తంభాన్ని ముట్టుకుని విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు గమనించి బాలుడిని కాపాడి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు అక్కడకు చేరుకుని విద్యుత్ స్తంభానికి కరెంట్ తీగలు తగులుతుండడంతో విద్యుత్ షాక్ వస్తున్నట్లు గుర్తించి సమస్యను పరిష్కరించారు.

డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు



డిస్ట్రిబ్యూటరీకి కొత్త తలుపు ఏర్పాటు చేస్తున్న ఇరిగేషన్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

డిండి: డిండి ప్రాజెక్టు ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటరీలకు గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంపై ఈ నెల 22వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులేవి' అనే కథనానికి ఇరిగేషన్ అధికారులు ఆదివారం స్పందించారు. ఈ మేరకు ప్రాజెక్టు ఎడమ కాలువకు సంబంధించి పాడైన డిస్ట్రిబ్యూటరీలకు ఇరిగేషన్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఈ వానాకాలం సీజన్‌లో ఆయకట్టు చివరి పొలాలకు పంట చివరి దశ వరకు నీరందేలా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు.

గ్లాసుల తయారీ కంపెనీలో అగ్నిప్రమాదం

- షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటలు
- మంటలు చల్లార్చిన ఫైర్ సిబ్బంది
- రూ.1.50 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా



ఎగిసిపడుతున్న మంటలు



మంటలు చల్లార్చుతున్న ఫైర్ సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట): షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్లాస్టిక్ గ్లాసుల తయారీ కంపెనీలో మంటలు చెలరేగాయి. ఈ ఘటన చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన యలగందుల సిద్దార్థ దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీజయశంకర్ పాలిమర్స్ పేరిట ప్లాస్టిక్ గ్లాసుల తయారీ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఆ కంపెనీలోని గ్లాసులు, వాటి తయారీకి ఉపయోగించే మెటీరియల్ భద్రపరిచే గోదాంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వాచ్‌మన్ గమనించి వెంటనే కంపెనీ యజమాని సిద్దార్థకు విషయం తెలుపడంతో ఆయన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాసక సిబ్బంది మంటలు చల్లార్చే లోపు 40 టన్నుల మెటీరియల్, 250 గ్లాసుల బాక్సులు, రీసైక్లింగ్ రోల్స్, షీట్ రోల్స్, హైప్స్ కాలిబూడిదయ్యాయి. దగ్ధమైన సామగ్రి విలువ రూ.1.50 కోట్లు ఉంటుందని కంపెనీ యజమాని సిద్దార్థ పేర్కొన్నారు. అతడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఏఎస్‌ఐ కనకరత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం..

ఈ కంపెనీ సమీపంలోనే పెట్రోల్ బంక్ ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. మంటలు బంక్ వరకు వ్యాప్తి చెందకుండా ఫైర్ సిబ్బంది అదుపులోకి తెవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

వలిగొండ: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలంలోని ఎదులగూడేనికి చెందిన బుర్ర సుగుణమ్మ(70) దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో శనివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ లాల్ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు..



శివకుమార్ (ఫైల్)

భువనగిరి రూరల్: కుటుంబ కలహాల కారణంగా గడ్డి మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. వివరాలు.. భువనగిరి మండలంలోని పచ్చర్ల బోడుతండాకు చెందిన బానోతు శివకుమార్ (24) గ్రామంలోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో ఈ నెల 11వ తేదీన శివకుమార్ తమ వ్యవసాయ భూమి వద్ద గడ్డి మందు తాగాడు. అనంతరం తల్లికి ఫోన్ చేసి తాను పురుగుల మందు తాగినట్లు చెప్పగా.. ఆమె గ్రామస్తుల సహకారంతో 108 వాహనంలో శివకుమార్‌ను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శివకుమార్ తండ్రి బానోతు ధర్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ఇద్దరు వ్యక్తులు అదృశ్యం



డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం ఇద్దరు వ్యక్తులు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీ మెయిన్ బజార్‌లో పర్వతనేని నాగేశ్వర్‌రావు అలియాస్ పెద్దబాబు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాడు. హిల్‌కాలనీకి చెందిన రహమాన్ అందులో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తనను శివగా పెద్దబాబుకు పరిచయం చేసుకున్నాడు. స్థానికంగా నదిలో వలలు లాగడానికి వచ్చానని, ఆ పని చేయలేకపోతున్నానని, ఏదైనా పని ఉంటే ఇవ్వమని పెద్దబాబును కోరాడు. కానీ అతడిని పనిలో పెట్టుకోవడానికి పెద్దబాబు నిరాకరించాడు. ఊరికి వెళ్లడానికి కూడా తన వద్ద డబ్బులు లేవని, ఏ పనైనా చేస్తానని, చార్జీలకు డబ్బులు కావాలని బతిమిలాడటంతో అతడిని పనిలో పెట్టుకున్నాడు. రెండు రోజులుగా షాపింగ్ కాంప్లెక్స్‌లో శివ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. శనివారం రాత్రి పది గంటల సమయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రహమాన్, షాపింగ్ కాంప్లెక్స్ యజమాని పెద్దబాబుకు ఫోన్ చేసి రాత్రి పది గంటలైనా శివ పెయింటింగ్ పనులు చేస్తున్నాడని చెప్పాడు. అతడిని ఏమీ అనవద్దని, అతని పనిని అతడిని చేసుకోనివ్వు అని రహమాన్‌కు చెప్పి పెద్దబాబు ఫోన్ పెట్టేశాడు. ఉదయం షాపింగ్ కాంప్లెక్స్ వద్దకు వచ్చిన పెద్దబాబు అక్కడ రక్తపు మరకలు ఉండటం గుర్తించాడు. అంతేకాకుండా శివ, రహమాన్ కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వచ్చి స్థానికులను విచారించారు. రహమాన్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటం, రహమాన్ ఇంటి వద్ద సైతం లేకపోవడంతో, నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను పిలిపించారు. పెద్దబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ సంపత్‌గౌడ్ తెలిపారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్): నాటుసారా తయారుచేసే స్థావరాలపై ఆలేరు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ దీపిక తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలేరు మండలంలోని కందిగడ్డ తండా, సేవాలాల్ తండా, పుట్టగూడెం తండా, తుర్కపల్లి మండలంలోని శ్రీనివాసపురం గ్రామాల్లో నాటుసారా తయారుచేసే స్థావరాలపై ఆలేరు ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా కందిగడ్డతండాలో సారా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, అతనిపై కేసు నమోదు చేశారు. అతడికి రూ.లక్ష జరిమానా కూడా విధించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు నిరోష, విజయ్, సిబ్బంది సమీ కుమార్, రంగయ్య, ఇమామ్, కిమియ, బాలరాజు, మంజుల, అనిత తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులు నమ్మకంగా పనిచేస్తారు

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



తీన్మార్ మల్లన్న, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న మున్నూరు కాపు సంఘం సభ్యులు

ఆత్మకూర్(ఎస్): మున్నూరు కాపులు ఏ పార్టీలో ఉన్నా నమ్మకంగా పనిచేస్తారని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం ఆత్మకూర్(ఎస్)మండల పరిధిలోని నెమ్మికల్‌లో జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్నను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కృషిచేస్తుందని పేర్కొన్నారు. తన గెలుపునకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని, ఆయన తనయుడు సర్వోత్తమ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో చట్టసభలకు తీసుకుపోవడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. అనంతరం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్నూరు కాపులు మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీతోనే ఎక్కువగా కలిసి ఉండేవారని, వారి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. మున్నూరు కాపులలో పేదవారిని గుర్తించి వారి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న కేసీఆర్ ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను నిర్భయంగా వెలికితీశాడని, అందుకే పట్టభద్రులు ఆయనకు పట్టం కట్టారని అన్నారు. 34 నియోజకవర్గాలకు తీన్మార్ మల్లన్న ప్రాతినిధ్యం వహిస్తున్నాడని, అన్ని నియోజకవర్గాలలో అందరిని సమన్వయపరచుకొని ముందుకు వెళ్లాలని కోరారు. మున్నూరు కాపులకు మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కాపు సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఏఐసీసీ నాయకులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డి, మున్నూరు కాపు సంఘం మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి రమేష్, రామసాని శ్రీనివాస్, ఎలిమినేటి అభినయ్, మానేపల్లి లక్ష్మయ్య, రామసాని రమేష్, డేగల కృష్ణ, డేగల రమేష్, పట్టల వెంకటేశ్వర్లు, శ్రవణ్, బీరవోలు రవీందర్ రెడ్డి, మిరియాల క్రిష్ణమూర్తి, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

- ఈ నెల 18న మిస్సింగ్ కేసు నమోదు
- నాలుగు రోజుల తర్వాత గుర్తించిన పోలీసులు
- నిందితుడిపై కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ పట్టణానికి చెందిన 16 ఏళ్ల బాలికను అదే కాలనీకి చెందిన ఓ యువకుడు మాయమాటలతో లోబర్చుకుని రాష్ట్ర సరిహద్దు దాటించాడు. అనంతరం బాలికను రహస్య ప్రదేశంలో మూడు రోజులు నిర్బంధించి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సదరు బాలిక ఈ నెల 18వ తేదీన అదృశ్యం కాగా పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. విచారణ ప్రారంభించిన పోలీసులు మిర్యాలగూడ పట్టణంలోని ఓ వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న బేబీరావు అనే యువకుడిపై అనుమానం రావడంతో అతడి ఫోన్ కాల్స్‌పై నిఘా పెట్టారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బేబిరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లా కోదూరు మండల కేంద్రంలో ఉన్నట్లుగా గుర్తించి అక్కడికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. బాలిక ఆచూకీ లభించింది. నిందితుడు బేబీరావుపై కిడ్నాప్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు.

మానవత్వం చాటుకున్న మంత్రి పొంగులేటి



ఘటనా స్థలంలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ అశోక్ గ్రామానికి వెళ్లే క్రమంలో సూర్యాపేట–ఖమ్మం రహదారి దాటుతుండగా, ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గమనించి తన కాన్వాయ్‌ని ఆపారు. ప్రమాదానికి గురైన అశోక్‌ను తన కాన్వాయ్‌లోనే సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. మంత్రికి బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్ పాలకవర్గాన్ని పునరుద్ధరించాలి



చౌటుప్పల్‌లోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మాజీ చైర్మన్, మాజీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు

చౌటుప్పల్ : నిబంధనలకు విరుద్ధంగా రద్దు చేసిన చౌటుప్పల్ పీఏసీఎస్ పాలకవర్గాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పాలకవర్గం రద్దుతో మాజీలుగా మారిన డైరెక్టర్లు దుబ్బాక శశిధర్‌రెడ్డి, పబ్బతి వెంకటయ్య, దొడ్డి శ్రీశైలం, దొడి బాలరాజు, పానుగోతు సూరనాయక్‌తో కలిసి ధర్నాకు దిగారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరడానికి అంగీకరించకపోవడంతో వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరాలని డీసీఓనే తమకు సూచించారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారిగా ఉండి అధికార పార్టీ నేతలకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. వైస్ చైర్మన్ ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటున్న డీసీఓ.. తమ ఫిర్యాదులను ఎందుకు పక్కన పెడుతున్నారని ప్రశ్నించారు. డీసీఓ నిర్ణయాలను సహకార ట్రిబ్యునల్, హైకోర్టు కూడా తప్పుబట్టిందని గుర్తుచేశారు. తక్షణమే కమిటీని పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఎంతవరకైనా సిద్ధమేనని తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, మార్కెట్, గ్రంథాలయ, ఆర్ఎస్ఎస్ మాజీ చైర్మన్లు బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, ఊడుగు మల్లేష్, కొత్త పర్వతాలు, నాయకులు సుర్కంటి రాంరెడ్డి, డిల్లీ మాధవరెడ్డి, సుర్వి మల్లేష్, అల్మాసిపేట కృష్ణ, గుండెబోయిన వెంకటేశం, తొర్పునూరి మల్లేష్, ఉప్పు కృష్ణ, కాకి సుందర్, దుబ్బాక ఆకాష్‌రెడ్డి, గంజి విజయ్, బాతరాజు యాదగిరి, వెంకట్రాంరెడ్డి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైరల్‌గా మారిన ఆడియో సంభాషణ

కాగా.. సంఘం మాజీ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి ఇటీవల జిల్లా సహకార అధికారి ప్రవీణ్‌కుమార్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడిన సంభాషణ ప్రస్తుతం వైరల్ అవుతోంది. 'నేను ఏం నేరం చేశాను.. రైతుల కోసం పని చేయడమే తప్పా'.. అని దామోదర్‌రెడ్డి ప్రశ్నించగా.. 'మీరు అందులోకి పోవాలి' అని డీసీఓ బదులిచ్చాడు. అందులోకి అంటే కాంగ్రెస్‌లోకేనా సార్.. అందులోకి పోవాలంటే ఎవరిని కలవాలి సార్ అని అని దామోదర్‌రెడ్డి అడిగాడు. ఎవరిని కలుస్తారో మీ ఇష్టం అని డీసీఓ పేర్కొన్నారు. వెంకట్‌రెడ్డి సార్‌నా, రాజగోపాల్‌రెడ్డినా అని దామోదర్‌రెడ్డి అడిగగా.. ముందు రాజగోపాల్‌రెడ్డినే అని డీసీఓ బదులు ఇచ్చాడు. నాపై ఎందుకు ఇలా చేస్తున్నారని దామోదర్‌రెడ్డి అడిగగా.. అక్కడ మీరు విలువైన వ్యక్తివి అని డీసీఓ స్పష్టం చేశారు. 'నేను నిజాయితీగా వ్యవస్థను నడిపాను.. ఇది మీ అందరికీ తెలిసిన విషయమే' అని దామోదర్‌రెడ్డి బదులిచ్చారు.

సాగర్‌ను సందర్శించిన బౌద్ధ విహార బృందం



బుద్ధుని పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న బృందం సభ్యులు

నాగార్జునసాగర్: ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మంగళగిరి బౌద్ధ విహార బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధుని పాదాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధచరిత, జాతక పార్కు, ధ్యాన పార్కు, స్థూప పార్కులను తిలకించారు. మహాస్థూపంలోని ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. బౌద్ధ దమ్మయాత్ర నిర్వాహకులు బుద్ధ విహార కార్యదర్శి పామర్తి రవి మాట్లాడుతూ.. మంగళగిరి బుద్ధవిహార ట్రస్టు ఆధ్వర్యంలో దేశంలోని బౌద్ధ కేంద్రాలను బౌద్ధ అభిమానులను సమీకరించి పర్యటిస్తుంటారని పేర్కొన్నారు. నాగార్జునకొండ మ్యూజియాన్ని సందర్శించి భద్రపర్చిన గౌతమ బుద్ధుని ధాతువులను వీక్షించి తన్మయత్వం పొందారు.


పద్మశాలీ ఉద్యోగుల సంఘం కార్యాలయాలు ప్రారంభం

నల్లగొండ: తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల కార్యాలయాలతో పాటు పద్మశాలీ మ్యారేజ్ బ్యూరో కార్యాలయాలను ఆదివారం నల్లగొండలో పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలీల సంక్షేమం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ కార్యాలయాలను పద్మశాలీలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ఆదివారం సంఘం కార్యాలయాల్లో వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నల్ల శ్రీనివాస్, యేశాల విశ్వకుమార్, మిర్యాల రాజేందర్, పొట్టబత్తుల సత్యనారాయణ, దుడుకు లక్ష్మీనారాయణ, మిర్యాల వెంకటేశ్వర్లు, పెండెం శ్రీనివాస్, బత్తిని రాజేశం, విష్ణుమూర్తి, గుండు శ్రీనివాస్, ప్రవీణ్, గోలి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు

వాహనాల బారులు



గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

బీబీనగర్: బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద భారీ సంఖ్యలో వాహనాలు బారులుదీరాయి. టోల్‌ప్లాజా మీదుగా ఆదివారం 30వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించాయి. ప్రధానంగా యాదాద్రి పుణ్య క్షేత్రంతో పాటు స్వర్ణగిరి ఆలయానికి వివిధ ప్రాంతల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం నుంచి రాత్రి వరకు వాహనాల రద్దీ కొనసాగింది. రాత్రి 10గంటల వరకు హైదరాబాద్ వైపు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గూడూరు టోల్ ప్లాజా నుంచి పగిడిపల్లి వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఫాస్టాగ్ స్కానింగ్ ఆలస్యం అవుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి మండలంలోని రాయగిరి ఫ్లైఓవర్‌పై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. ఆలేరుకు చెందిన చింతకింది వెంకటేష్ తన కుటుంబంతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. రాయగిరి ఫ్లైఓవర్‌పై హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కోన మారుతి కారు డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌తో పాటు నాగలక్ష్మి, లీలావతి, ధనుష్, అంచిక, వంశీతేజ్, ఢీకొట్టిన కారు డ్రైవర్ కోన మారుతి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిరేకల్‌లో బ్యాంక్ క్యాషియర్..

నకిరేకల్ : మండలంలోని తాటికల్ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంకు చెందిన అన్నపురెడ్డి రవికుమార్(43) గుర్రంపోడులోని గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు బైక్‌పై గుర్రంపోడు నుంచి విశాఖపట్నం వెళ్తుండగా.. మార్గమధ్యలో నకిరేకల్ మండలం తాటికల్ శివారులో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు ఒక్కసారిగా యూటర్న్ తీసుకోవడంతో వెనుక నుంచి రవికుమార్ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవికుమార్ రెండు చేతులు విరిగిపోయాయి. స్థానికులు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



హరి (ఫైల్)

తుంగతుర్తి: చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన తుంగతుర్తి మండలం మానాపురంతండాలో ఆదివారం జరిగింది. వివరాలు.. మానాపురంతండాకు చెందిన లాకావత్ హరి(47) తండా సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. కాళ్లకు చిక్కుకొని నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా తడక రమేశ్

- వైస్ చైర్మన్‌గా భారత రాజేంద్రప్రసాద్



నూతన పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి గోలి శ్రీనివాస్



తడక రమేశ్, చైర్మన్



భారత రాజేంద్రప్రసాద్, వైస్ చైర్మన్

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన చైర్మన్‌గా తడక రమేశ్, వైస్ చైర్మన్‌గా భారత రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోచంపల్లి పట్టణ కేంద్రంలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కొరకు నూతనంగా ఎన్నికైన 9మంది డైరెక్టర్లతో అధికారులు సమావేశం నిర్వహించి నామినేషన్లు స్వీకరించారు. చైర్మన్‌గా తడక రమేశ్, వైస్ చైర్మన్‌గా భారత రాజేంద్రప్రసాద్ నామినేషన్ వేశారు. 11గంటల వరకు నామినేషన్ వేయడానికి సమయం ఇవ్వగా, మరెవ్వరూ కూడా నామినేషన్ వేయకపోవడంతో ఉమ్మడి జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి గోలి శ్రీనివాస్ తడక రమేశ్ చైర్మన్‌గా, భారత రాజేంద్రప్రసాద్ వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, సూరెపల్లి రమేశ్, కొండమడుగు ఎల్లస్వామి, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, ఏలే హరిశంకర్‌చే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ సీత శ్రీనివాస్, ఎన్నికల అధికారి మహమూద్, మేనేజర్ రాచకొండ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గానికి ఘన సన్మానం..

నూతనంగా ఎన్నికైన బ్యాంక్ పాలకవర్గానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, మాజీ ఎంపీపీ బడుగు దానయ్య, భోగ విష్ణు, కొట్టం కరుణాకర్‌రెడ్డి, కొంగరి బాల్‌నర్సింహ, బండారు ప్రకాశ్‌రెడ్డి, చేనేత నాయకులు సీత శ్రీరాములు, పాలాది యాదగిరి, ముస్కూరి రాములు, సీత సుధాకర్, తాటి నర్సింహ, సీత సత్యనారాయణ, భారత బాల్‌రత్నం, భారత గిరివాస్, సీత గాంధీ, భూషణం, ఆకుల రాంచంద్రం, ఎలగందుల నర్సింహ తదితరులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.